**"క్షమించండి! పొరపాటున మా యిల్లు అనుకొని తలుపుతట్టాను. ఏమీ అనుకోకండి ప్లీజ్!" అంటూ వెనక్కి తిరిగాడు గోపాలం!**

**తలుపుతీసిన ఆ స్త్రీ వెనకనుండి గోపాలం చొక్కా కాలరు పుచ్చుకొని బలంగా లోపలికి లాగి తలుపులు ధబాల్న మూసేసింది.**




''పైత్యంగాని ప్రకోపించిందా లేక ఏ పిచ్చికుక్క అయినా కరిచిందా? ఇది మీ యిల్లే, నేను మీ పెళ్లాన్నే'' కోపంగా మిర్రిమిర్రి చూసింది.

గోపాలం కళ్లు గోలీకాయలంత పెద్దవిగా తయారయ్యాయి. భార్యవంక విస్తుపోతూ చూశాడు.

చాలాసేపటి నుంచి ఏడుస్తున్నట్లుగా ముఖమంతా వుబ్బిపోయి వుంది. బుగ్గల మీద ఎండిన కన్నీటి చారికలు. జుట్టంతా చిందరవందరగా వుంది.

''ఏమిటీ గోమతీ ఈ అవతారం? నువ్వు నువ్వేనా అసలు? ప్రతిరోజూ నేను ఆఫీసునుండి వచ్చేసరికి బాలీవుడ్ నుండి దిగుమతయిన హీరోయిన్‌లా ఎదురొచ్చే నువ్వు యివాళ యిలా ఆర్ట్ ఫిలింలో హీరోయిన్‌లా కనుపిస్తే గుర్తుపట్టలేకపోయాను సుమా! ఎందుకిలా వున్నావు?''

అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు గోపాలం.

భర్త పరామర్శతో గోమతిలో మళ్లీ దుఃఖం పొంగుకొచ్చి భోరున ఏడుస్తూ సోఫాలో కూర్చుండిపోయింది.

గాభరాపడిన గోపాలం ఆమె ప్రక్కన సోఫాలో కూర్చుని భుజం మీద చెయ్యి వేసి అనునయంగా ''గోమతీ! ఏ విషయం చెప్పకుండా నువ్విలా ఏడవడమే కార్యక్రమంగా పెట్టుకుంటే నాకెంత కంగారుగా వుంటుందో ఆలోచించు. ఏం జరిగిందో చెప్పు!'' అన్నాడు.


గోమతి ఏడుపు ఆపి భర్త చొక్కాతో కళ్లు, ముక్కు తుడుచుకుంటూ, ''ప్రియాంక జీవితం అన్యాయమైపోయిందండీ! విధి కన్నెరచేసి దాని బ్రతుకులో నిప్పుల వర్షం కురిపించింది. పాతికేళ్లకే ప్రియాంక బ్రతుకు నిర్జీవమై నిస్సహాయమై ఎండి మోడైపోయిందండీ! అందుకే మధ్యాహ్నం నుండీ భోజనం కూడా చెయ్యకుండా ఏడుస్తూ గడిపేశాను.'' అన్నది భర్త కళ్లల్లోకి దీనంగా చూస్తూ!

ఈ ప్రియాంక ఎవరో ఒక పట్టాన గుర్తురాలేదు గోపాలానికి!

''ప్రియాంక అంటే వరసగా అరడజనుమంది ఆడపిల్లల్ని కని వాళ్ల పెళ్లిళ్లు చెయ్యలేక దేశాలు పట్టిపోయిన మీ వేలు విడిచిన బాబాయి కూతుళ్లలో ఒకరు కదూ?'' అడిగాడు.

గోమతి కోపంగా చూసింది గోపాలం వైపు.

''మీ జ్ఞాపకశక్తి అఘోరించినట్లే వుంది. మా బాబాయి దేశాలు పట్టిపోయింది ఆడపిల్లల పెళ్లిళ్లు చెయ్యలేక కాదు మా పిన్ని పెట్టే బాధలు భరించలేక, ప్రియాంక అంటే వాళ్లల్లో ఒకరు కాదులెండి'' అన్నది.




గోపాలం కాసేపు బుర్రగోక్కుని చటుక్కున ఏదో గుర్తొచ్చినట్లు,

''అర్థమయిందిలే. నువ్వు మాట్లాడేది ప్రపంచసుందరి ప్రియాంకచోప్రా గురించే కదూ! ఆవిడకేదో కష్టం కలిగిందని వార్తల్లో వినివుంటావు. అందుకే యింతగా బాధపడుతున్నావు. అవునా గోమతీ! అయినా నీదెంత మంచిమనసు! ఆవిడ నీకు ఏమీ కాకపోయినా ఆవిడ గురించి యింతగా తల్లిడిల్లుతున్నావంటే మదర్ థెరిస్సాగారి పక్కన నిలుచునే అర్హత నీకుంది గోమతీ!'' అన్నాడు గడగడా!

గోపాలం వాగుడు ధోరణికి విసుగొచ్చిన గోమతి ఏమాత్రం ఆలశ్యం చెయ్యకుండా అతని బుగ్గమీద బలంగా పొడిచింది.

''ప్రియాంక అంటే వీళ్లెవరూ కాదులెండి. నా అభిమాన టి.వి.ఛానెల్ 'ఎనిమీ టి.వి.'లో రెండున్నర సంవత్సరాలుగా నడుస్తున్న 'దిక్కుమాలిన మొగుడు' సీరియల్‌లో కథానాయిక పేరు. ఈరోజు ఎపిసోడ్‌లో ఆవిడ భర్త ఘోర ప్రమాదంలో మరణించాడు. అది చూసినప్పటినుండీ నా మనసు మనసులో లేదండీ! ప్రియాంక బ్రతుకు ఏమౌతుందోనన్న ఆలోచన నన్ను పట్టి పీడిస్తున్నది. అందుకే ఇలా వున్నాను'' అంటూ మళ్లీ కన్నీళ్లు పెట్టుకోసాగింది గోమతి!

గోపాలం ఆశ్చర్యంతో నోరు తెరిచాడు! గోమతి ఇంత రాద్ధాంతం చేసింది టి.వి.సీరియల్‌లో హీరోయిన్ కష్టాల గురించా! తన భార్యకి టి.వి.సీరియల్స్ అంటే తగని పిచ్చి అని తెలుసుగానీ, మరీ యింతగా చలించిపోయేటంత చాదస్తమా అనుకున్నాడు మనసులో. ఆ మాట బయటికి అంటే గోమతి ఎంత మండిపడుతుందో తెలుసు గనక ఆ ప్రయత్నం మానుకున్నాడు.

భార్యకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తూ ''మరీ అంత మృదువైన మనసైతే ఎలా గోమ్! ఇలాంటివన్నీ ఇలా చూసి అలా మర్చిపోతూ వుండాలి. అయినా సీరియల్ పేరు 'దిక్కుమాలిన మొగుడు' అని నువ్వే అన్నావుకదా! అలాంటి మొగుడు వుంటే ఎంత, పోతే ఎంత చెప్పు!'' అన్నాడు.

భర్త మాటలకు కోపంతో మండిపడింది గోమతి!

''ఎలాంటివాడైనా మొగుడు మొగుడే కదండీ! వాడెంత దిక్కుమాలినవాడైనా ఆడదానికి దిక్కు మొగుడే కదా!'' అన్నది.

అవునన్నట్లు బుద్ధిగా తలూపాడు గోపాలం!

''సరేగానీ నేను ఆఫీసునుండి వచ్చి యింతసేపయింది గదా! నా ముఖాన ఇన్ని

టీనీళ్లు పోసే ఆలోచనవుందా లేదా?'' అడిగాడు.

గోమతి వంటింట్లోకి పరుగెత్తి పది నిముషాల్లో టీకప్పుతో తిరిగొచ్చింది. గోపాలం టీ త్రాగుతూ ''గోమతీ! పగలనక రాత్రనక టి.వి. చూస్తూ కాలక్షేపం చెయ్యకపోతే టెన్త్‌క్లాస్‌లో మిగిలిపోయిన సబ్జెక్ట్సు పూర్తి చేసే ప్రయత్నం చేస్తే ఎంత బాగుంటుంది చెప్పు'' అన్నాడు.

గోమతి ముఖం చిట్లించి ''ఇప్పుడా పుస్తకాలు ఎవరు చదువుతారులెండి. అయినా టెన్త్ కంప్లీట్ చెయ్యకపోతే యిప్పుడు నాకొచ్చిన లోటు ఏముంది. మనిషికి డిగ్రీలకంటే ప్రపంచజ్ఞానం ముఖ్యం. టి.వి.కార్యక్రమాల వల్ల నా జనరల్ నాలెడ్జి ఎంత పెరిగిపోయిందో మీకేం తెలుసు?'' ఎదురు ప్రశ్నించింది.

ఇంకేమీ మాట్లాడలేకపోయాడు గోపాలం!

★ ★ ★

రాత్రి పదకొండు గంటలయింది.

బెడ్‌మీద అసహనంగా అటూ ఇటూ పొర్లుతున్నాడు గోపాలం! కళ్ల మీదకి నిద్ర ముంచుకొస్తున్నా భార్య రాకకోసం ఆత్రంగా ఎదురుచూస్తూ బలవంతాన నిద్రకు ఆనకట్టవేస్తున్నాడు.

''ఇదిగో వస్తున్నా. ఈ ఒక్క సీరియల్ చూసి వచ్చేస్తా!'' అని గంటన్నర నుంచి చెబుతూనే వుందిగాని టి.వి. ముందు నుంచి కదిలి రావడం లేదు. మూడ్ అంతా అప్‌సెట్ అయిపోయిన గోపాలం పన్నెండు వరకు నిరీక్షించి ఇక వల్లకాక నిద్రలోకి జారుకున్నాడు.

తీరిగ్గా సీరియల్స్ అన్నీ చూసి పన్నెండున్నరకు బెడ్‌రూంలోకి వచ్చింది గోమతి. నిద్రపోతున్న భర్తను ప్రక్కకు జరిపి మంచం మీద వాలింది.

★ ★ ★

ఆ నెల టెలిఫోన్ బిల్లు చూసి గుండెలు గుభేలుమన్నాయి గోపాలానికి.

దాదాపు మూడు వేలు! బిల్లుని పరీక్షగా చూశాడు. టెలిఫోన్ రెంటల్స్, లోకల్ కాల్స్ తప్ప మిగిలినదంతా ఎస్.టి.డి. ఛార్జీలే! అవన్నీ హైదరాబాదుకి చెయ్యబడిన కాల్స్! తనెప్పుడూ హైదరాబాదుకి కాల్స్ చెయ్యలేదు. గోమతి అంతంత సేపు హైదరాబాదులో ఎవరితో మాట్లాడిందో గోపాలానికి అర్థం కాలేదు.

గోమతిని పిలిచి అడిగాడు.

''గోమతీ! నాకు తెలిసి హైదరాబాదులో నీకు ఫ్రెండ్సుగానీ, బంధువులుగానీ ఎవరూ లేరే! మరి ఫోన్ బిల్లులో ఈ హైదరాబాద్ కాల్స్ ఏమిటి?''

గోమతి వెంటనే బిల్లు అందుకొని దాన్ని పరికించి చూసింది.

''ఇవన్నీ ఎనిమీ టీవీ టెలిఫోన్ నెంబర్స్ అండీ!'' అన్నది చప్పున.

గోపాలం విరాగ్గా ''ఎనిమీ టీవీలో నీకు ఫ్రెండ్సుగాని వున్నారా ఏమిటి?'' అని అడిగాడు.

గోమతి పకపకా నవ్వుతూ ''అంత సీన్ లేదులెండి!




ఎనిమీ టీవీ వాళ్ళు అభిమాన ప్రేక్షకుల కోసం, వాళ్లకు బహుమతులు అందివ్వటం కోసం రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఎంచక్కా మనం ఫోన్ చేసి సినిమా స్టార్స్‌తో, యాంకర్స్‌తో ముచ్చటించవచ్చు. వాళ్ల అడిగే ప్రశ్నలకు సమాధానాలు కరెక్టుగా చెబితే బోలెడు బహుమతులు కూడా మన స్వంతం అవుతాయి. ఆ కాల్స్ అన్నీ అలా చేసినవే!'' అన్నది.

గోపాలానికి ఒళ్లు మండిపోతూ వుంది. కోపంతో జుట్టు పీక్కుంటూ అన్నాడు. ''మరి ఇంతవరకు ఎన్ని బహుమతులు సంపాదించావు?''

గోమతి గర్వంగా ''అబ్బో! చాలా బహుమతులు ప్రకటించారులెండి. సోప్ బాక్సులు, బఠాణీలు, ఉప్పు శనగల గిఫ్ట్ ప్యాకెట్లు, నిరోధ్ ప్యాకెట్లు ఇలా చాలా బహుమతులు సంపాదించానులెండి. అయితే యింత వరకు ఏదీ నా చేతికి అందలేదు. త్వరలోనే వస్తాయి!'' అన్నది.

''నీ టి.వి. పిచ్చి తగలెయ్య! మూడు వేలు టెలిఫోన్ బిల్ చేసి సోప్‌బాక్సులు, నిరోధ్ ప్యాకెట్లు, బఠాణీలు బహుమతిగా సంపాదించావని ఎంత పొంగిపోతున్నావే! ఇక పై యిలాంటివి చేశావంటే టి.వి.ని బద్దలు కొడతాను లేదా నీ బుర్రనైనా జాగ్రత్త!'' అని బెదిరించాడు.

గోమతి మూతి ముడుచుకొని లోనికెళ్లింది!

★ ★ ★

పులిమీద పుట్రలా ఆ నెల కరెంటు బిల్లు కూడా మామూలు దానికంటే మూడు రెట్లు ఎక్కువగా వచ్చింది. ఇది యిలాగే కంటిన్యూ అయితే టెలిఫోన్ బిల్లులు, కరెంటు బిల్లులు కట్టడానికే తన జీతం సరిపోయేలా వుంది అని భయపడ్డాడు గోపాలం. చెబితే అర్థం చేసుకునే రకం మనిషి కాదు తన భార్య! తన మనసుకి ఎంత తోస్తే అంత! చిన్నప్పటి నుంచీ అలా పెరిగింది తల్లిదండ్రుల దగ్గర. మహా మొండిఘటం!

గోపాలం బాగా ఆలోచించి ఈ సమస్యకు పరిష్కారంగా నెల్లూరు నుండి తన బామ్మను పిలిపించాలని నిర్ణయించుకున్నాడు. ఆవిడ గడ్డిపెడితేనైనా గోమతి తన ధోరణి మార్చుకుంటుందని గోపాలం ఆశ!

★ ★ ★

బామ్మ రాగానే తన గోడు అంతా ఆమె ముందు ఏకాంతంగా వెళ్లగ్రక్కుకున్నాడు గోపాలం. టెలిఫోన్ బిల్లులు, కరెంటు బిల్లులు, రాత్రి పన్నెండు దాటినా పడకగదికి రాకపోవటం అన్నీ పూసగ్రుచ్చినట్లు చెప్పుకొచ్చాడు. అంతా విన్న బామ్మ గోపాలానికి అభయహస్తం యిచ్చింది గోమతిని మారుస్తానని. ఆ తర్వాత అన్నది.

''అసలు దీనికంతకీ కారణం మీకు పిల్లలు లేకపోవడం. ఒక పిల్లో, పిల్లవాడో వుంటే గోమతికి టి.వి.చూసేంత తీరిక, ఓపిక వుండవు. అయినా పెళ్లయి మూడేళ్లు దాటింది కదా! ఇంకా పిల్లలు పుట్టలేదంటే యిద్దరిలో ఎవరో ఒకరిలో లోపం వుండి తీరాలి. ముందు ఆ పని చూడండి. మంచి డాక్టరు దగ్గరికి వెళ్లి యిద్దరూ పరీక్షలు చేయించుకోండి'' అని తొందరపెట్టింది.

'ఈ పాయింటు కూడా కరక్టే' అనుకున్న గోపాలం గోమతిని వెంటబెట్టుకొని డాక్టరు అవతారం దగ్గరికి వెళ్లాడు. ఆయన రకరకాల టెస్టులు, ఎక్స్‌రేలు, స్కానింగులు చేయించాడు యిద్దరికీ. దాదాపు పది

ఇ.టి.రామారావు

హేను వేల బిల్లు చేసి, ఆ రిపోర్టులన్నీ పరీక్షించి అన్నాడు.

''రిపోర్ట్స్ అన్నీ పర్‌ఫెక్ట్‌గా వున్నాయి. ఎవ్వరిలోనూ ఏ లోపం లేదు. అయినా మీకు పిల్లలు పుట్టలేదంటే కేవలం భగవంతుని చిన్నచూపే కారణం'' అని తేల్చి చెప్పాడు. తర్వాత గోపాలాన్ని దగ్గరగా పిలిచి చెవిలో ''ఊరు చివర ఆశ్రమంలో స్వామి పుత్రానందల వారున్నారు. ఎందుకైనా మంచిది. వారిని కలవండి. తప్పక మీకు సంతాన యోగం సిద్ధిస్తుంది. నాకూ ఆ స్వామి దయవలనే పిల్లలు పుట్టారు'' అని వూదాడు.

గోపాలం బిక్కముఖం వేసుకొని బైటికొచ్చాడు.

గోమతిని టి.వి. చూడకుండా చెయ్యాలని శతవిధాలా ప్రయత్నం చేయసాగింది బామ్మ. అయితే ఆమె ప్రయత్నాలు ఏ ఒక్కటీ ఫలితం యివ్వడం లేదు. గోపాలం ఆఫీసుకి వెళ్లింది మొదలు టి.వి.కే అంటిపెట్టుకోవడం ఆరంభించింది. ఇదివరకు వంట చేసుకోవాలి కాబట్టి గంటో, అరగంటో గ్యాప్ యిచ్చేది. బామ్మగారు రావటంతో వంటపని ఆవిడకు అప్పచెప్పి టి.వి.లోకంలో మునిగిపోసాగింది గోమతి.

గోమతికి టి.వి.పిచ్చి వదిలించడం తనవల్ల కాని పని అని నిర్ణయానికి వచ్చేసింది. మనవడి ముందు ఓటమిని అంగీకరించి తిరుగు ప్రయాణం అయింది. వెళుతూ గోపాలంతో అన్నది.

''మీకు యింకా పిల్లలు పుట్టలేదంటే ఏదో లోపం వుందనుకున్నాను. కానీ ఏ లోపమూ లేదని డాక్టర్లు తేల్చి చెప్పాక, నాకు తోచిన కారణం ఒకే ఒక్కటుంది. నీ పెళ్లాం అర్ధరాత్రి దాకా టి.వి.సీరియల్స్ చూడటం ఆపి పెందరాళే పడ్గదికి చేరుకుంటే త్వరలోనే మీకు సంతానప్రాప్తి కలుగుతుంది. లేదంటే ఈ జన్మకి నీకు పిల్లలు కలగరు.''బామ్మ మాటలు విన్న గోపాలం సిగ్గుతో, అవమానభారంతో తలవంచుకున్నాడు.


★ ★ ★

ఆఫీసులో కొలీగ్ ఒకతనికి ప్రమోషన్ వచ్చిన సందర్భంగా అతనింట్లో పార్టీకి హాజరయ్యాడు గోపాలం. పార్టీ మంచి రసపట్టులో వుంది. ఇంతలో ఎవరో టి.వి. ఆన్ చేశారు. అనౌన్సర్ స్క్రీన్ మీద చిరునవ్వులు చిందిస్తూ వుంది.

''మరికొద్ది క్షణాల్లో మీరు మీ అభిమాన కార్యక్రమం 'భౌ.భౌ..బోర్ 20' చూడబోతున్నారు. మా అభిమాన ప్రేక్షకులు ఫలానా నెంబరికి ఫోన్ చేసి మా యాంకరితో ముచ్చటించటమే కాకుండా, మీరు కోరిన చెత్తపాటలు కూడా వినవచ్చు. ఈ ప్రోగ్రాంకి ఫోన్ చేసేవాళ్లకి ఒక ముఖ్య గమనిక. మేము స్టూడియోలో ఫోన్ లిఫ్ట్ చేయగానే మీరు 'భౌ..భౌ..బోర్ 20' అనాలి. లేదంటే మీ ఫోన్ కనెక్షన్ కాకి ఎత్తుకుపోతుంది'' అని పలికింది అనౌన్సర్.

''ఐ.ఆర్.20 బియ్యంలాగ, టిక్ 20 ఎలుకల మందులాగ ఈ భౌభౌ బోర్ 20 ఏమిటో చూడాలి మరి!'' అన్నాడు ఒక మిత్రుడు.

అంతా ఆసక్తిగా ఆ ప్రోగ్రాం చూడసాగారు.




''మీ అభిమాన భౌ...భౌ..బోర్ 20 కార్యక్రమానికి స్వాగతం! ఈరోజు ఫస్ట్ కాల్ ఎవరిదో చూద్దాం!'' అని ఫోన్ రిసీవర్ ఎత్తి ''హలో'' అన్నది.

అవతలి వైపునుండి ''భౌ..భౌ..బోర్ 20'' అని వినిపించింది.

''ఎగ్జాక్ట్లీ! మీరెవరు?'' యాంకర్ ప్రశ్నించింది.

''నా పేరు గోమతి అండీ! సూళ్ళూరుపేట నుండి యస్.టి.డి. చేసి మాట్లాడుతున్నాను'' అవతలి గొంతు పలికింది.

గోపాలం ఉలిక్కిపడ్డాడు. అది తన భార్య గొంతే! అతని స్నేహితులు కూడా గమనించసాగారు.

''రేయ్ గోపాలం! నీ మిసెస్ రా!'' అన్నారు సంతోషంగా.

గోపాలం కాస్తంత గర్వపడ్డాడు. అంతా ఆసక్తిగా సంభాషణ వినసాగారు.

''గోమతిగారు! ఇందాక మీరు భౌ..భౌ అని చాలా సహజంగా, అచ్చం కుక్కపిల్లలా అరిచారు. ఎలా సాధ్యపడిందండీ యిది? మీరు మిమిక్రీ ఆర్టిస్టా?''

''అబ్బే లేదండీ! దీనికి ప్రేరణ నా పతిదేవుడు గోపాలంగారు'' ''మీ వారు మీకు ప్రేరణా? అదేమిటో వివరంగా చెప్పగలరా? ప్రేక్షకులంతా విని ఆనందిస్తారు.''

''ఇంట్లో వున్నంతసేపు మావారు నా చుట్టూ కుక్కపిల్లలా నా కొంగు పట్టుకొని తిరుగుతూ వుంటారండీ! నేను షాపింగ్‌కో, సినిమాకో వెళితే కుక్కలా యింటికి కాపలా వుంటారండీ! ఎప్పుడైనా కోపం వస్తే పిచ్చికుక్కలా పైనబడి రక్కుతారండీ!''

భార్య జవాబు విన్న గోపాలం బిక్కచచ్చిపోయాడు. మిత్రులంతా అతన్ని చూసి పకపకా నవ్వసాగారు.

''యాంకర్‌గారూ! మీరు కట్టుకున్న పట్టుచీర కంచిదా లేక వెంకటగిరిదా? అంచు మాత్రమే జరీ అనుకుంటాను. నిజమేనా?'' గోమతి గొంతు.

''గోమతిగారూ! ఇది పట్టు చీరకానే కాదండీ! ప్యూర్ కాటన్ చీర. మీకు పట్టుచీరలా అగుపిస్తున్నదంటే మీరు కళ్ల డాక్టరును చూడాల్సిన టైం దగ్గర పడిందండీ!''

అలా అనేక విషయాల మీద సంభాషణ సాగిపోతూనే వుంది.

తన టెలిఫోన్ బిల్లు వేలకు వేలు ఎందుకొస్తుందో ప్రత్యక్షంగా తెలిసొచ్చింది గోపాలానికి!

★ ★ ★

ఒకరోజు గోపాలం ఆఫీసునుండి యింటికొచ్చేసరికి యిల్లంతా ఆడవాళ్లతో నిండివుంది. వాళ్లంతా తమ కాలనీలోనే వుంటున్న యిరుగుపొరుగు వాళ్లుగా గుర్తించాడు గోపాలం. అతన్ని చూడగానే ఒక్కొక్కరు బయటికి వెళ్లిపోయారు.

గోమతి అతనికి ఎదురొచ్చి, ''యివ్వాళ నేను ఒక వ్రతం చేసానండీ! దీనివలన మీకు నూరేళ్ల ఆయుష్షు, నాకు నిత్య సౌభాగ్యము సిద్ధిస్తాయని, 'నా పెళ్లాం నాకే స్వంతం' సీరియల్‌లో హీరోయిన్ చెప్పిందండీ. ఆ సీరియల్లో ఆవిడ కూడా యిలాంటి వ్రతమే చేసింది'' అని చెప్పుకొచ్చింది.

గోపాలానికి ఏం మాట్లాడాలో తోచలేదు. ''పోనీలే పిచ్చిది. తన సుఖం కోసమే గదా వ్రతం చేసింది. కాకుంటే పసుపు, కుంకుమ, ఆకు, వక్క పొట్లాల ఖర్చు. అంతేగా'' అని సరిపెట్టుకున్నాడు. సంతృప్తిపడ్డాడు.ఆ తర్వాత కొద్దిక్షణాల్లోనే బాంబులాంటి వార్త పేల్చింది గోమతి!

''ఆ సీరియల్‌లో హీరోయిన్ చెప్పిన ప్రకారం పద్దెనిమిదిమంది ముత్తయిదువులకు వెండి కుంకుమ భరిణలు ప్రజెంట్ చేశానండీ! సేఠ్ చమన్‌లాల్ అంగట్లో మీ పేరన అప్పు రాయించి తీసుకున్నాను. ఇదిగో బిల్లు. రేపు జీతం రాగానే ఆ డబ్బు కట్టెయ్యండి'' అంటూ బిల్లు గోపాలం చేతికిచ్చింది.

బిల్లులోని అమౌంట్ చూడగానే ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్టు గిలగిలా తన్నుకుంటూ దబ్బున కూలబడిపోయాడు గోపాలం!